ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు


5★★

మంగళవారం 19 ఆగస్టు 2025

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

● 39 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కులు విడుదల

7



గేట్లు ఎత్తడంతో దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

న్యూస్ బాక్స్

మృతుల కుటుంబాలకు పరామర్శ

బీమారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీమారం బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎండీ రాజబోసు అమ్మ మరణించగా వారి కుటుంబసభ్యులను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావులు సోమవారం పరామర్శించారు. అలాగే దేశాయిపేట గ్రామానికి చెందిన మారు మహిపాల్ ఇటీవల మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కథలాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగేశ్వర్ రావు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

●సారంగాపూర్: మండంలోని బట్టపెల్లి గ్రామనికి చెందిన రిటైర్డ్ టీచర్ కోల రాఘవులు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత పరామర్శించారు.

దెబ్బతిన్న వంతెనను పరిశీలించిన నాయకులు

బీర్‌పూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని తుంగూర్ కండ్లపెల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి సైడ్ పిల్లర్ పగుళ్ల చూపి ప్రమాదకరంగా మారగా సోమవారం నాయకులు పరిశీలించారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతలు బ్రిడ్జిని పరిశీలించి సంబందిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మర మ్మతు పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ జెడ్పిటీసీ కొల్ముల రమణ, నేరేల్ల సుమన్, సాగి సత్యం రావ్, సారంగాపూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్ర రెడ్డి, సింగిలివిండో చైర్మన్ నవీన్ రావ్ , జితేందర్ యాదవ్, జోగి రెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛతపై నజర్



జిల్లాలోని పాఠశాలలు..	
ప్రాథమిక పాఠశాలలు	516
ప్రాథమికోన్నత పాఠశాలలు	88
ఉన్నత పాఠశాలలు	220
మొత్తం పాఠశాలలు	824
ఉపాధ్యాయుల సంఖ్య	3,750
విద్యార్థుల సంఖ్య	57,552

- 'ఎస్‌హెచ్‌వీఆర్'కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం
- పచ్చదనం, పరిశుభ్రతపై రేటింగ్
- యాప్‌లో వివరాల నమోదుకు సెప్టెంబరు 30 వరకు గడువు
- యూడైస్ ఉన్న ప్రతీ స్కూల్‌కు అవకాశం

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, హరిత లక్ష్యసాధనలో దేశంలోని పాఠశాలల అభివృద్ధి ఎలా ఉందనే విషయం తెలుసుకునేందుకు కేంద్ర విద్యా, అక్షరాస్యతశాఖ స్వచ్ఛం ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) 2025-26 అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ (ఎస్‌వీపీ)ను సవరించి ఎస్‌హెచ్‌వీఆర్ 2025-26ను ప్రవేశపెట్టారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. న్యూఢిల్లీలో జూలై 29న జరిగిన కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎస్‌హెచ్‌వీఆర్ అనే మదింపు విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ విధానం ద్వారా పాఠశాలల స్థాయిని నిర్ధారించి ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. దేశంలోని అన్ని పాఠశాలలు ఆన్‌లైన్‌లో వాటి స్థితిగతులను తెలుపుతూ 2025 సెప్టెంబరు 30వ తేదీ నాటికి సమగ్ర వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. యూడైస్‌కోడ్ ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వ సహాయక, ప్రైవేటు, వివిధ గురుకుల సంక్షేమ, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యా సంస్థలు వంటి కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు ఈ రేటింగ్‌లో పాల్గొనడానికి అర్హత కల్పించారు.

●ఎస్‌హెచ్‌వీఆర్ లక్ష్యాలు...

పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడానికి ఎస్‌హెచ్‌వీఆర్ ఉపయోగపడాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టారు. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయుల్లో స్థిరమైన పర్యావరణ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, సామర్థ్యాలతో సంబంధం లేకుండా, పిల్లందరికీ సమ్మిళిత, సురక్షితమైన బోధనాభ్యసన వాతావరణాన్ని సృష్టించడంలో కీలకంగా ఉపయోగపడాలన్న లక్ష్యంతో అమలుకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలను ఆరు కీలక అంశాల ఆధారంగా మూల్యాంకనం చేస్తారు. పాఠశాలల్లో నీటి లభ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రత, నిర్వహణ, పాఠశాల మౌలిక సదుపాయాలు, స్వచ్ఛత, మిషన్‌లైఫ్ కార్యకలాపాలు, పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలపై సర్వే చేపడతారు. మెరుగైన మదింపు సాధనాలు, సరళీకృత ప్రశ్నాపత్రాలు, ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్ఐసీ, యూఎన్ఐసీఈఎఫ్ అభివృద్ధి చేసిన ఆధునిక సమాచార పరిజ్ఞానంతో ఎస్‌హెచ్‌వీఆర్ రేటింగ్‌ను నిర్ధారిస్తుంది. పాఠశాలల పనితీరు, గుర్తింపు, రేటింగ్ ఆధారంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిట్ సర్టిఫికెట్లను అందిస్తారు.

● జిల్లా స్థాయిలో...

జిల్లా స్థాయిలో నాలుగు వర్గాల పాఠశాలలను గుర్తించి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది పాఠశాలలను గుర్తించి ఫైవ్ స్టార్ రేటింగ్ ఇవ్వనున్నారు. వీటిని రాష్ట్ర స్థాయిలో నామినేషన్‌కు అర్హత... - మిగతా 8లో

యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అదనపు కలెక్టర్ లత, ఇతర అధికారులు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా కలెక్టర్లు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావులతో కలిసి మంత్రి తుమ్మ నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ యూరియా సరఫరాలో చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెద్ద రైతుల అవసరాలకు విడతల వారీగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, సహకార శాఖ అధికారి మనోజ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'సీసీ రోడ్డు పనులు వేగవంతం చేయాలి'

ధర్మపురి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని 3, 11, 12, 13 వ వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావుకు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గాజు భాస్కర్ మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. డ్రైనేజీల నిర్మాణం కోసం పూడిక తీసి, 20 రోజులుగా వదిలి పెట్టడం వల్ల వర్షాల వల్ల నీరు నిలిచి ఇళ్లలోకి చేరుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, సీనియర్ నాయకులు నలుమాసు వైకుంఠం, సురేందర్, ప్రధాన కార్యదర్శి తిరుమన్‌దాసు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మల్లేష్ పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దు'

జగిత్యాల అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ మల్యాల, పెగడపల్లి మాజీ జడ్పీటీసీ సభ్యులు కొండపల్కల రాంమోహన్ రావు, తాటిపర్తి శోభారాణి మాజీ కౌన్సిలర్ మొగిలయ్యలు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నివాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పగా కొద్దిరోజులు టవర్ నిర్మాణం నిలిపి వేసి మళ్లీ చేపడుతున్నారని ఆరోపించారు. గతంలో ఈ ప్రాంతం గోవింద్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నపుడు ఇక్కడ టైర్‌ల ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో నివాస గృహాలు ఉన్నందున టైర్‌ల ద్వారా వచ్చే పొగతో శ్వాస కోశ వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. టైర్‌ల ఫ్యాక్టరీని కూడా తొలగించాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో వారు కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



అభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మెట్‌పల్లి మండల విద్యాధికారి మేకల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని ప్రాథమిక పాఠశాల గాజులపేటలో టీఎల్ఎం మేళాను నిర్వహించారు. ఈ టీఎల్ఎం మేళాలో మల్లేశం, శ్యామ్ సుందర్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏ.నర్సయ్య, బి.మోహన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరోచిత పోరాటానికి ప్రతీక సర్వాయి పాపన్న

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వీరోచిత పోరాటానికి, సమానత్వానికి ప్రతీకగా సర్వాయి పాపన్నగౌడ్ నిలిచారని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బహుజనుల ఆత్మ గౌరవం కోసం తన సర్వస్వాన్ని ధార బోసిన మహాయోధుడు అని అదనపు కలెక్టర్ కొనియాడారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రప టానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని కూల దోసి గోల్కొండ కోటపై జెండా ను ఎగురవేసిన యోధుడు పాపన్నగౌడ్ అని కొనియా డారు. ఆయన ఆశయ సాధన కు అన్ని వర్గాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జగి త్యాల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు మధుసూదన్, శ్రీని వాస్, మెప్మా ఏవో దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ కార్యదర్శిపై ఫిర్యాదు

బీర్‌పూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ కార్యదర్శి సరైన విధంగా విధులు నిర్వహించడం లేదని గ్రామానికి చెందిన బైరవేణి సత్యనారాయణ సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మురికి కాలువలు శుభం చేయడం లేదని, ఎక్కడి చెత్త అక్కడే వదిలేస్తున్నారని ఆరోపించారు. మంచి నీళ్ల బావులలో బ్లీచింగ్ పౌడం వేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గృహాల చుట్టూ చెత్త చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకొని గ్రామంలో పారిశుధ్య లోపాలు లేకుండా చూడాలని కోరారు.

హమాలీ కార్మికుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. కార్మికులందరూ లేబర్ కార్డు పొందాలని ఆయన సూచించారు. సోమవారం జగిత్యాల పట్టణంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో హమాలీ కార్మికుల కార్యాలయం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామ్రాజ్యం, కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కొమురయ్య, గౌరవధ్యక్షులు రాజేశం, పట్టణ అధ్యక్షులు గంగారాం పాల్గొన్నారు.

జగిత్యాలలో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ సభ్యులు చెట్‌పెల్లి సుధాకర్, కళాశాల అధ్యపక బృందం తదితరులు పాల్గొన్నారు.

'తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

రాయికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. మండలంలోని గోదావరి తీర ప్రాంతాలైన జగన్నాథ్‌పూర్, నాయకపు గూడెం ప్రజలకు వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గోదావరి నది వరద ఉధృతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ ఎస్సై సుధీర్ రావు, ఎంపీడీవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున గోదావరి పరివాహక ప్రాంత్రాలకు ఎవరూ వెళ్లకూడదని మల్లాపూర్ తహసీల్దార్ రమేష్ సూచించారు. సోమవారం ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి గోదావరిలోకి నీరును అధికారులు వదలడంతో ఆయన స్థానిక అధికారులతో కలిసి మండలంలోని వాల్గొండ గ్రామ శివారులోని గోదావరిని పరిశీలించారు. ఎస్సారెస్పీ నుంచి నీటిని వదడలంతో ఎగువ నుంచి దిగువకు నీరు ప్రవహించడంతో గోదావరిలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రకు మార్కెట్ కమిటీ పాలకవర్గం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సోమవారం విజ్ఞాన యాత్రకు బయలుదేరి నట్టు ఏఎంసీ చైర్మన్ బోరుగాం రాజు పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా ఇతర మార్కెట్లను సందర్శించి ఇతర మార్కెట్లలో రైతులకు కలిగంచే సౌకర్యాలను పరిశీలించి, ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డును అభివృద్ధి చేసేందుకు దోహదంచేసే అంశాలను తెలుసు కుంటామన్నారు. ఇందులో భాగంగా సోమ వారం మహారాష్ట్రలోని లాతూర్ వ్యవసాయ మార్కెట్‌ను పాలకవర్గసభ్యులు సందర్శిం చారు. లాతూర్ మార్కెట్ యార్డ్‌లో సోయాబీన్, కందులు పంటను కొనుగోళ్లను పరిశీలించారు. ఈ విజ్ఞానయాత్రలో ఏఎంసి ఉపాధ్యక్షుడు ఎలాల వెంకటరెడ్డి, సభ్యులు మార్కెట్‌కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధురాలి మృతి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శివ గాయత్రి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాధ వృద్ధురాలు మలమ్మ సోమవారం మృతి చెందారు. వృద్ధాశ్రమ నిర్వహకులు రంగు రాజయ్య ఆశ్రమ సభ్యులు ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలి'

మల్యాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1న చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అబ్దుల్ జమీల్ కోరారు. మల్యాలలో సోమవారం మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసే ప్రక్రియ చేపట్టాలని అన్నారు. సెప్టెంబరు 1 పింఛన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని చేపడుతున్న ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, మండల విద్యాధికారి జయసింహరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కిషోర్‌కుమార్, గంగాధర్, సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆరోగ్య తెలంగాణకు ప్రభుత్వం చర్యలు'



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ కోసం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలం లోని భూషణరావుపేట రైతువేదికలో సోమవారం 41 మందికి రూ.15.76 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజారోగ్యంకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి వసతులను వైద్యశాలల్లో మెరుగు పరుస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి ప్రజారోగ్యంపై చిత్తశుద్ధి చాటుకున్నారని గుర్తు చేశారు. అనంతరం చింతకుంటలో రూ.20 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను మహిళా సంఘాలతో ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణకు అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీం, ఏఎంసీ డైరెక్టర్ రాజరెడ్డి, మాజీ జడ్పీటీసీ భూమయ్య, అంబటి రాధాకృష్ణ, డీఈవో రాము, హెచ్‌ఎం రవి పాల్గొన్నారు.

విష జ్వరంతో పారిశుధ్య కార్మికుడు మృతి



జట్టు స్వామి(ఫైల్)

చిగురుమామిడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న జట్టు స్వామి(51) అనే పారిశుధ్య కార్మికుడు సోమవారం విషజ్వరంతో మృతిచెందినట్లు గ్రామ మాజీసర్పంచ్ సన్నీల్ల వెంకటేశం తెలిపారు. స్వామికి రెండు రోజులక్రితం తీవ్రంగా జ్వరం వచ్చింది. గ్రామంలోనే వైద్యం చేసుకున్నప్పటికీ తగ్గలేదు. ప్రైవేట్ వైద్యానికి వెళ్లలేని ఆర్థికపరిస్థితి. దీంతో పరిస్థితి విషమించి జ్వరంతో మృతిచెందాడని తెలిపారు. గ్రామాల్లో దోమలు ఎక్కువగా ఉండడం వల్ల మురికి కాలువల వద్ద పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు జ్వరాల బారిన పడుతున్నారు. కార్మికులకు గ్లౌజ్‌లు, దోమలు కుట్టకుండా ప్రత్యేక యూనిఫామ్‌లు, అందించి, పనిగంటలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు.

యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్(35) అనే యువకుడు సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాజశేఖర్ భార్య మూడునెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి రాజశేఖర్ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన రాజశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. మృతుడి తల్లి గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

● ఒకరు మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్‌రహదారిపై సోమవారం రాత్రి కారు, ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందగా అందులో ఉన్న మరోముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఎల్ఎండీపోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హైదరాబాద్‌కి చెందిన నలుగురు కరీంనగర్‌లో ఓఫంక్షన్‌కి వచ్చి తిరిగి ఇంటికి హైదారాబాద్‌కు సోమవారంరాత్రి బయలుదేరారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామం రాజీవ్ రహదారిపై వెళుతున్న కారు ముందు వెళుతున్న మరో వాహనాన్ని ఓవర్‌టెక్ చేయబోయి అదుపుతప్పి పక్కనేఉన్న డివైడర్ దాటుకొని హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కరీంనగర్ డిపోకి చెందిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సును ఢీకొంది. కారు బస్సు కిందికి దూసుకువెళ్లింది. ఈప్రమాదంలో కారులో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న హైదారాబాద్‌కి చెందిన కొంగారి మృత్యంజయ్(32) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మిగితా ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. బస్సులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సుకింద ఇరుకున్న కారులోంచి మృతదేహన్ని, మిగతావారిని బయటకు తీశారు. మృతదేహన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



ఇందిరానగర్ వద్ద జరిగిన కారు, బస్సు ప్రమాదం

చెరుకు రైతుకు ఏటా
తప్పని తిప్పలు



జగిత్యాలలో సాగవుతున్న చెరుకు పంట

● జగిత్యాల జిల్లా నుంచి కామారెడ్డికి తరలింపునకు రవాణా చార్జీల భారం
● ముత్యంపేట కర్మాగారం లేఆఫ్‌తో రైతులకు కష్టాలు
● రూ.3 కోట్ల రవాణా చార్జీల భారం
● ప్రభుత్వ సహాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని చెరుకు రైతులకు రవాణా చార్జీలు యేటా తప్పడం లేదు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ కర్మాగారం (ఎన్‌డీఎస్ఎల్) పదేళ్ల క్రితం లే ఆఫ్‌తో మూసివేయడంతో ప్రతీ యేటా చెరుకు రైతులు క్రషింగ్ సీజన్‌లో తిప్పలు పడుతున్నారు. జిల్లాలో పండించిన చెరుకును ఇతర ప్రాంతాలకు తరలించి అదనపు ఆర్థికభారంతో నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం చెరుకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలోని రైతులు తమ పంటను కామారెడ్డి జిల్లాకు తరలించి రవాణా చార్జీల భారం మోయనున్నారు. రవాణా కోసం టన్నుకు రూ.500 వ్యయం అదనంగా భరించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

చెరుకు రైతును వీడని లే ఆఫ్ కష్టాలు..

జిల్లాలో ఏకైక వ్యవసాయాధారిత కర్మాగారమైన మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కర కర్మాగారం లే ఆఫ్‌కు గురయి పదేళ్లుగా తెరుచుకోక పోవడంతో చెరుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కర్మాగారానికి నష్టాలు వస్తున్నాయన్న సాకుతో 2015 డిసెంబరు 23వ తేదీన లే ఆఫ్ ప్రకటించి కర్మా గారాన్ని మూసివేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పండించిన చెరుకు ఇతర ప్రాంతాలకు తరలించ డానికి రవాణా చార్జీలను మోయాల్సి వస్తోంది. జిల్లాలోని చెరుకు రైతులపై సుమారు రూ.3 కోట్ల రవాణా భారం పడుతోంది. జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో పండించిన చెరుకును ప్రస్తుత క్రషింగ్ సీజన్‌లో రైతులు కామారెడ్డి జిల్లాలోని పలు ప్రైవేటు ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. చెరుకు తరలింపునకు ఖర్చులు తడిచి మోపెడవుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రవాణా చార్జీలను భరించలేక ప్రభుత్వ సహాయం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తగ్గిన చెరుకు సాగు...

గతంలో జగిత్యాల జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా చెరుకు సాగు చేసేవారు. ముత్యంపేటలోని కర్మాగారం మూతపడ్డ తర్వాత ప్రస్తుతం జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో మాత్రమే చెరుకు పంట సాగు అయినట్లు అధికారుల గణాంకాల ద్వారా తెలుస్తోంది. 1500 ఎకరాల్లో సుమారు 60,000 టన్నుల చెరుకు దిగుబడి వస్తోంది. జగిత్యాల జిల్లా నుంచి కామారెడ్డికి 150 కిలోమీటర్ల దూరం చెరుకును తరలించడానికి రైతుకు టన్నుకు రూ.500 వరకు ఖర్చు అవుతోంది. జిల్లాలో దిగుబడి అయిన 60 వేల టన్నులకు సుమారు రూ.3 కోట్ల రవాణా భారాన్ని రైతులు భ రించాల్సి వస్తోంది. గతంలో ముత్యంపేట శివారులో గల చక్కెర కర్మాగారానికి చెరు కు పంటను తరలించడానికి రైతులకు ఎటువంటి భారం పడేది కాదు. ప్రస్తుతం కష్టనష్టాలకు ఓర్చుకొని పండించిన చెరు కు అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రికి రైతుల వినతి

జగిత్యాల జిల్లా కేంద్రానికి ఈనెల 13న వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పలువురు చెరుకు రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. జిల్లాలో 1500 ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నామని, సుమారు 60 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. ఇక్కడి చెరుకును కామారెడ్డిలోని గాయాత్రీ షుగర్ ఫ్యాక్టరీకి తరలించ డానికి టన్నుకు రూ.500 రవాణా భారం అదనంగా పడుతోందని, ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని మంత్రి శ్రీధర్ బాబును రైతులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తానని హామీ ఇచ్చారు.



కామారెడ్డి జిల్లాకు లారీలో తరలుతున్న చెరుకు (ఫైల్)

రవాణా చార్జీల భారం ప్రభుత్వం భరించాలి

వాకిడి సత్యంరెడ్డి, చెరుకు రైతు, కిసాన్‌సెల్ నాయకుడు, జగిత్యాల



జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలోని రైతులు కామారెడ్డి ప్రాంతంలోని కర్మాగారానికి చెరుకు రవాణా చేయడానికి టన్నుకు రూ.500 రవాణా భారం అదనంగా పడుతోం ది. రైతులపై పడుతున్న ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరించాలి. ముత్యంపేట చక్కర కర్మాగారం లే ఆఫ్‌లో ఉన్నప్పటికీ అధికారుల సూచనల మేరకు రైతులు చెరుకు సాగు చేశారు. అదనపు రవాణాచార్జీల భారంపై ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను విన్నవించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశతో ఎదురుచూస్తున్నాం.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● ఏడుగురి అరెస్ట్

బోయినపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానువాడ గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఏడుగురిని పట్టుకున్నారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మానువాడ గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించగా ఏడుగురు పేకాట ఆడుతూకనిపించారు. వీరినుంచి రూ.1360 నగదు, 8సెల్‌ఫోన్లు, రెండుద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురి అరెస్టు..

జగిత్యాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని గోవిందుపల్లిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై జగిత్యాల పోలీసులు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారివద్ద రూ.80,600నగదు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ వివరించారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

● రెండు తులాల బంగారం అపహరణ

వీణవంక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్ గ్రామ శివారులోని రేణుకఎల్లమ్మ ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. పోలీసులు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఆలయాల్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి రెండున్నర తులాల బంగారం, 59తులాల వెండి ఎత్తికెళ్లారు. కోర్కల్ గ్రామస్తుడు పూదరి కృష్ణ పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. పోలీసులు క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

బావిలో దూకి యువకుడి బలవన్మరణం

జమ్మికుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన హమాలి శివ(25) అనేయువకుడు సోమవారం రాత్రి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులుతెలిపిన వివరాల ప్రకారం.. శివ కూలిపని చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తల్లి మందలించడంతో రామన్నపల్లి పరిధిలోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌లు సంఘటనస్థలాన్ని పరిశీలించారు. నీళ్ల ఎక్కువగా ఉండటంతో మంగళవారం ఉదయం మృతదేహం వెలికి తీపిస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకనుతరలిస్తున్న మూడుట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి గ్రామశివారులోని వాగు నుంచి ఇసుకను అక్ర మంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సజీవ సాక్ష్యం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఫొటోలు సజీవసాక్ష్యాలు.. వేల అక్షరాలకన్నా, లక్షలాది శబ్దాలకన్నా దృశ్యం శక్తివంతమైనది. ఒక్క ఫొటోతో విభిన్న భావాలు ఆవిష్కరించవచ్చు. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పలు ఛాయాచిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

- జమ్మికుంట/ధర్మపురి, ఆంధ్రజ్యోతి



● ఎల్ఎండీలో సంధ్యా సమయం



● ధర్మపురికి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్లూరి రవీందర్ తీసిన ఫొటో



● బతుకు చక్రం

ఫొటోలు : ఎండీ ముకూర్ - ఆంధ్రజ్యోతి , స్టాఫ్‌ఫొటోగ్రాఫర్





జమ్మికుంటకు చెందిన కెమరామన్ బిట్ల తిరుపతి పలు సందర్భాల్లో తీసిన ఫొటోలు

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనంనడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండుసంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3,500 జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూసన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ(55) అనే మహిళ 2021 జనవరి 24న రాయికల్ మండలం కుమ్మరిపెల్లిలో తన బంధువులు ఇంట్లో శుభకార్యానికి జగిత్యాల నుంచి టాటా ఏస్ వాహనంలో వెళ్లింది. డ్రైవర్ పరాంకుశం వంశీకృష్ణ వాహనాన్ని సెల్‌ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తగా నడుపడంతో మోరపెల్లి గ్రామశివారులో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న గంగవ్వ వాహనం కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కోడలు రాధ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేయగా సీఐ కృష్ణకుమార్ విచారణ చేపట్టారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ సరైన సాక్ష్యులను కోర్టులోప్రవేశపెట్టారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి వంశీకృష్ణకు జైలుశిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ అభినందించారు.

ప్రజావాణిలో యువకుడి ఆత్మహత్యాయత్నం

● ఉద్యోగం ఇవ్వడం లేదని ఆవేదన ● ఆసుపత్రికి తరలింపు, ప్రాణాపాయం లేదన్న వైద్యులు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బండి సతీష్ అనే యువకుడు సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన బండి సతీష్ తండ్రి మధునయ్య ప్రాథమిక పాఠశాలలో పార్ట్‌టైం స్వీపర్‌గా పని చేసేవాడు. ఈ ఏడాది జనవరి26 గణతంత్ర దినోత్సవం రోజు విధి నిర్వహణలో ఉండగా మధునయ్యకు విషపురుగు కాటు వేసింది. వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి, అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంతరలించగా చికిత్స పొందుతూ జనవరి 29న మరణించాడు. కుటుంబానికి న్యాయం చేయాలని పాఠశాల ఆవరణలో మృతదేహంతో మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ మేరకు మధునయ్య కుమారుడు బండి సతీష్ దరఖాస్తు చేసుకున్నాడు. కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని ఆందోళనకు గురైన సతీష్ సోమవారం ప్రజావాణికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్పందించిన అధికారులు వెంటనే 108కి ఫోన్‌చేసి సతీష్‌ని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రధానఆసుపత్రికి తరలించారు. ప్రాణాప్రాయస్థితి నుంచి బయటపడ్డాడని వైద్యులు పేర్కొన్నారు.



పురుగుల మందు తాగిన బండి సతీష్

కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట రైతుల ఆందోళన

● పరిహారం చెల్లించాలని డిమాండ్



మొలంగూర్‌లో కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

శంకరపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కావేరి సీడ్స్‌కు చెందిన ఆడ, మగ హైబ్రిడ్ వరిరకం వంగడం సాగు చేసిన రైతులకు అనుకున్న దిగుబడి రాకపోవడంతో పరిహారం చెల్లించాలని రైతులు, ఆర్గనైజర్లు శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులోని కావేరి సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళనకు దిగారు. కరీంనగర్, వరంగల్, నిజామబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలలో సీడ్ ఆర్గనైజర్లు సీడ్‌ప్లాంట్ ద్వారా తెచ్చిన హైబ్రిడ్ వరివంగడాలను రైతులకు ఇవ్వగా సాగుచేశారు. సుమారు మూడు వేళ ఎకరాలలో అనుకున్న దిగుబడి రాలేదని రైతులు ఆరోపించారు. సరైన పంట దిగుబడి రాకుంటే ఎకరాకు రూ.60వేలు పరిహారం ఇస్తామని చెప్పి సాగు చేయిం చారని రైతులు తెలిపారు. దిగుబడి చాలా తక్కువ రావడంతో ఆ వచ్చిన ధాన్యానికే డబ్బులు చెల్లించారని, పరి హారం అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వరి ధాన్యం తూకం వేసి నాలుగు నెలలు గడుస్తున్నా కంపనీ ప్రతినిధులు పరిహారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటలపాటు రైతులు సీడ్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేయగా ఏజీఎం ఆర్గనైజర్‌కు ఫోన్ చేసి మంగళవారం సమస్య పరిష్కారా నికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రెండేళ్లుగా ఎదురు చూపులు

● అమలుకు నోచుకోని పీఎం విశ్వకర్మ పథకం ● పెండింగ్‌లోనే దరఖాస్తులు



చొప్పదండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది రకాల చేతి వృత్తుల పనివారికి శిక్షణను ఇచ్చి ఉపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం విశ్వకర్మ పథకం నిలిచిపోయింది. పాతవారికి శిక్షణ లేకపోగా కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి సైట్ ఓపెన్ కావడం లేదు. తద్వారా పథకం అమలులో జాప్యం జరుగుతోంది. రెండేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. అనేకమంది లబ్ధిదారుల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2023లో పీఎంవిశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. 18రకాల చేతివృత్తుల పనివారికి శిక్షణను ఇచ్చి 15వేల రూపాయల విలువగల పనిముట్లను అందజేయాలని సంకల్పించి దరఖాస్తులను ఆహ్వానించారు. పథకం ప్రారంభ సమయంలో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించారు. అనంతరం పథకం కాస్తా అటకెక్కింది. ఆసక్తి ఉన్న చేతివృత్తి పనివారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించగా మొదటి విడతలో కొంతమందికి శిక్షణ ఇచ్చారు. 15రోజులపాటు కరీంనగర్, జమ్మికుంటలో శిక్షణను ఇచ్చారు. వృత్తి పనుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా శిక్షణను ఇచ్చి శిక్షణకు సంబంధించి ప్రోత్సాహంగా 4వేల రూపాయలను అందించారు. అనంతరం 15వేల రూపాయల టూల్ కిట్లను అందజేశారు. కొంతమందికి బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించారు. 18రకాల చేతివృత్తుల్లో వడ్రంగి, టైలరింగ్, మేస్త్రి పనుల శిక్షణ కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగతా 15రకాల చేతివృత్తుల పనివారి కోసం అధికారులు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. మండలంలో అనేకమంది దరఖాస్తు చేసుకోగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి సైట్ ఓపెన్‌కావడం లేదు. దరఖాస్తు చేసుకున్నవారికి శిక్షణను ఇచ్చి టూల్ కిట్లు అందించాలని పలువురు కోరుతున్నారు.

● రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం..

- గోపులకొండ శ్రీనివాస్, చొప్పదండి



పీఎం విశ్వకర్మ పథకం కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాను. ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేశాను. మండలానికి చెందిన కొంతమందికి మాత్రమే టూల్‌కిట్లు అందాయి. చాలామంది ఎదురుచూస్తున్నారు. శిక్షణను ఇచ్చి బ్యాంకు లోన్లు ఇప్పించాలి. పథకం అందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఎస్సారెస్పీ భూమి ఆక్రమదారులకు రిమాండ్

ధర్మారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నకిలీపత్రాలు సృష్టించి ఎస్సారెస్పీ భూమిని ఆక్రమించడమే కాకుండా, అధికారులను చంపుతామని బెదిరించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలకేంద్రంలో ఎస్సారెస్పీ సంబంధించిన భూములున్నాయి. వాటిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి కొనుగోలు చేశారని, భూమివద్దకు అధికారులు వెల్లగా తమను చంపుతామని బెదిరించారని ఎస్సారెస్పీ అధికారులు ఏప్రిల్ 23న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం ధర్మారం గ్రామానికి చెందిన యాంసాని మహేష్‌తోపాటు అతని కుమారులు యాంసాని మధు, యాంసాని మనోజ్‌లను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జా చేసిన, వాటిని అమ్ముకున్న, ప్రజలను మోసం చేసి భూములను కాజేసిన, చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

బోస్టన్‌ను సందర్శించిన ఎస్‌యూ వీసీ


గణేశ్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అమెరికా పర్యటనలో భాగంగా బోస్టన్ నగరాన్ని సందర్శించారు. అక్కడి తెలంగాణ మేధావులను, పూర్వ విద్యార్థులను కలిశారు. మీట్‌అండ్‌గ్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో విద్య పాత్ర విశ్వవిద్యాలయాల బాధ్యతలు తదితర అంశాలపై చర్చించి సలహాలను తీసుకున్నారు. తెలంగాణలో విద్య పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అక్కడి ప్రముఖులు డాక్టర్ జంధ్యం దివాకర్, డాక్టర్ వెంకట్ మారోజు, రాయదాసు మంతెన తదితరులు పాల్గొన్నారు.



బోస్టన్‌లో ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

39 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కులు విడుదల


గేట్లు ఎత్తడంతో దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తుండడంతో 39 గేట్లు పైకి ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 1,17,148 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 72.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,26,867 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని అధికారులు కోరుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో ప్రస్తుత సీజన్‌లో తొలిసారిగా నీటిని గోదావరికి వదిలిపెట్టారు.

సుందిళ్ల బ్యారేజీకి భారీ వరద


సుందిళ్ల బ్యారేజీలో భారీగా చేరిన వరదనీరు

మంథనిరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, పై నుంచి భారీ వరద నీరు రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో సోమవారం గేట్లు ఎత్తి వేయడంతో భారీగా వరద నీరు దిగువ ప్రాంతమైన సుందిళ్ళ బ్యారేజీలోకి 1లక్ష 40 వేల 428 క్యూసెకుల నీరు వచ్చి చేరింది. అయితే బ్యారేజిలో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో ఆనీరు దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మంథని, ఖానాపూర్, ఖాన్‌సాయిపేట, ఆరెంద గ్రామల వరకు గోదావరిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది. అడవిసోమన్‌పల్లి, వెంకటాపూర్, మల్లారం, ఆరెంద గ్రామల వద్ద మానేరు నది నిండుగా ప్రవహిస్తుంది.

● **శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వస్తున్న వరద**

శ్రీపాద ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి 78,059 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 32 గేట్ల ద్వారా 1,65,632 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతుండగా, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కులను 2 పంపుల ద్వారా తరలిస్తున్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ పరిణామాలపై
కేంద్ర ప్రభుత్వం ఆరా

హుటాహుటిన ఢిల్లీ నుంచి రామగుండానికి టెక్నికల్ టీమ్‌లు..

సాంకేతిక వైఫల్యాలపై కేంద్ర మంత్రుల దృష్టి


ఆర్ఎఫ్‌సీఎల్ అమ్మోనియా ప్లాంట్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. రామగుండంలో ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ రైతాంగానికి యూరియా సరఫరా చేస్తున్నామని ప్రధాని మోదీ గతంలో ప్రకటించారు. కానీ ప్లాంట్ తరచూ సాంకేతిక అవరోధాలతో షట్‌డౌన్ కావడం, నాలుగు నెలల్లో మూడు సార్లు ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి రజత్ మిశ్రా ఆర్ఎఫ్‌సీఎల్ పరిణామాలపై సమీక్షిస్తున్నట్టు తెలుస్తుంది. పార్లమెంట్ జరుగుతున్న సమయంలో ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయం ఢిల్లీ నుంచి రామగుండంకు తరలించాలని, వైఫల్యాలపై విచారణ జరుపాలనే డిమాండ్లు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చర్చనీయాంశమయ్యాయి.

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతోపాటు కాంగ్రెస్ ఎంపీల బృందం శనివారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి నడ్డాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో సాంకేతిక వైఫల్యాలను కూడా నడ్డా దృష్టికి తీసుకువచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నడ్డ కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఎంపీ వంశీకృష్ణ గతంలోనే కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శిని కలిసి ఆర్ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై ఫిర్యాదు చేశారు. ఎరువులు, రసాయనాలశాఖలో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ బలరాంనాయక్‌లు కూడా ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలంటూ కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శికి లేఖలు రాశారు. నాలుగు నెలల్లో మూడు సార్లు షట్‌డౌన్‌లు జరుగడం, అమ్మోనియా పైప్‌లైన్లు నాసిరకంగా నిర్మించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్ర కోటాను సగానికి తగ్గించడం, కేటాయించిన కోటాలో సగం కూడా సరఫరా కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుంది. రెండు రోజుల క్రితం ప్లాంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది కేంద్రం కుట్ర అంటూ ఆరోపణలు చేశారు. కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రం కావడం, ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి నిలిపివేతపై కుట్ర కోణంలో ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి హుటాహుటిన అధికారుల బృందాలు రామగుండానికి చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఎన్ఎఫ్ఎల్, ఈఐఎల్‌కు చెందిన పలువురు అధికారులు రామగుండం చేరుకున్నారు. ఈ నెల 22వ తేదీలోగా ప్లాంట్‌లో ఉత్పత్తి దశలో పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో వైపు ఆర్ఎఫ్‌సీఎల్ వ్యవహారం కేంద్ర మంత్రి దృష్టికి వెళ్లడంతో ఉన్నత స్థాయి బృందం రామగుండంకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది.

తపాలాశాఖ ప్రమాద బీమాతో ధీమా

● రోజుకు రూ.1.50తో రూ.10 లక్షల బీమా

● రోజుకు రూ.2తో రూ.15 లక్షల బీమా



భగత్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలైనా... వైద్య ఖర్చులైనా.... విద్యా ప్రయోజనా లైనా.... అత్యవసరంగా అంత్యక్రియలకు డబ్బుల అవసరానికి సామాన్యులకు బీమా పాలసీలతో తపాల శాఖ ధీమా కల్పిస్తున్నది. ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించి గాయాలైనపుడు లేదా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన సందర్భాల్లో ఇలా అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు పాక్షికంగా, లేనిపక్షంలో తాత్కాలిక వైకల్యం కూడా ఏర్పడవచ్చు. ఈ క్రమంలో రక్షణగా ప్రైవేటు బీమా పాలసీలు ఉన్నప్పటికీ ప్రీమియం అధికంగా ఉండటంతో వాటిపట్ల ప్రజలు ఆసక్తి కనబరచడంలేదు. ఈ తరుణంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా పలు ప్రైవేట్ కంపెనీలతో తపాలా శాఖ సంయుక్తంగా ప్రమాద బీమా పాలసీలు అందుబాటులోకి తీసుకు వచ్చింది.

● **ఎంతో భరోసా**

రోజుకు రూ.1.50తో రూ.10 లక్షలు, రూ. 2లతో రూ.15లక్షలు విలువైన బీమా పాలసీలను తపాలాశాఖ అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఏడాదికి రూ.549 ప్రీమియంతో అకాల మరణాలకు రూ.10 లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. ప్రమాదం కారణంగా శాశ్వత వైకల్యానికి పూర్తి బీమా చెల్లిస్తారు. అంగవైకల్యం కానీ, పక్షవాతం వచ్చినా పూర్తి బీమా లభిస్తుంది. ప్రమాదవశాత్తు వైద్య ఖర్చులు ఒ.పి.డి రూ.30 వేలు, లేదా ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేకపోతే 10 సార్లు రూ.1500 విలువైన కన్సల్టేషన్లు వర్తిస్తాయి. ప్రమాదం జరిగి ఆసుపత్రిలో ఉంటే రూ.60 వేల వరకు చెల్లిస్తారు. ఇద్దరు పిల్లలకు విద్యా ప్రయోజనం కింద గరిష్ఠంగా రూ. లక్ష వరకు లభిస్తుంది. ఒకవేళ ఫీజులు తక్కువగా ఉంటే వాటినే చెల్లిస్తారు. ప్రమాదం జరిగి వ్యక్తి కోమాలోకి వెళ్తే రూ. లక్ష వరకు కవర్ చేస్తారు. ఎముకలు విరిగితే దాని ఖర్చుల నిమిత్తం రూ. లక్ష వరకు చేకూరుతుంది. తలకు ఏదైనా దెబ్బ తగిలి మానసికంగా ఇబ్బంది పడితే నాలుగు కన్సల్టెంట్లు ఉచితంగా అందించనున్నారు. ఒకరికి ప్రమాదం జరిగి వేరేచోట మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి రావడానికి రూ.25 వేల వరకు చెల్లిస్తారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు భరోసాగా రూ.5 వేల వరకు లభిస్తుంది.



● **అర్హతలు**

బీమా పాలసీని 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు ఎవరైనా తీసుకోవచ్చు. దీన్ని తెరవడానికి దగ్గరలోని తపాలా కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది. ఆధార్ కార్డు, దానితో లింక్ అయిన ఫోన్ నంబరు ఉండాలి. వైద్య పరీక్షలు చేసిన తరువాత కొందరికి వర్తిస్తుంది. సాయుధ బలగాలకు ఇది వర్తించదు. ఈ అవకాశాన్ని సామన్యులు బీమా పాలసీలు పొంది వినియోగించుకోవాలని కరీంనగర్ తపాలశాఖ అధికారులు కోరుతున్నారు.

కల్లుపై దుష్ప్రచారాలను నమ్మవద్దు

తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఒక కల్లు దుకాణంలో ఊదో జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా కల్లుపై వస్తున్న దుష్ప్ర చారాలను నమ్మవద్దని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పేద గౌడ మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావుగౌడ్ మాట్లాడుతూ అబ్కారీ అధికారులు గ్రామాల్లో కల్లు దుకాణాలపై దాడులు చేస్తూ వేధింపులకు గురిచేస్తే ఊరుకోబోమన్నారు. విస్కీ, బ్రాందీలో 40 శాతం ఆల్కహాల్ ఉంటుందని చెబుతున్నారని, కానీ 50 శాతం ఆల్కహాల్ ఉంటుందని, దానిపై అధికా రులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్లును మాత్రమే బదనాం చేస్తున్నారని ఆరోపించారు. కల్లుపై చేస్తున్న దుష్ప్రచారాలను ఎదుర్కోవడానికి గౌడ కులస్థులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారా యణగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గౌడ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గాయత్రి పంపుహౌజ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

● వరద కాలువకు చేరిన ఎస్సారెస్పీ నీరు


వరదకాలువను పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి

రామడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌజ్ నుంచి మిడ్ మానేరుకు సోమవారం కూడా నీటి విడుదల కొనసాగింది. ఆదివారం నాలుగు పంపుల ద్వారా వరద కాలువకు నీటిని విడుదల చేసిన అధికారులు ఎస్సారెస్పీ నుంచి నీరు రావడంతో మూడు పంపులకు కుదించారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో గాయత్రి పంపుహౌజ్ నుంచి 10వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు వచ్చి చేరుతోంది. దీంతో రెండువైపులా నీరు రావడంతో వరద కాలువ ద్వారా 15వేల క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలివెళ్తోంది. కాగా ఎస్సారెస్పీ నీరు 18వేల క్యూసె క్కుల నీటిని వరదకాలువకు విడుదల చేయడంతో గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదలను ఆపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాత్రి వరకు ప్రస్తుతంనడిపిస్తున్న మూడు పంపులను కూడా ఆపేయనున్నారు.

రామడుగు మండలం శ్రీరాములపల్లె సమీపంలోని వరదకాలువను ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సారెస్పీ నీరు, గాయత్రీ పంప్‌హౌస్ నీరు కలిసేచోట వరదకాలువను పరిశీలించారు.

మిడ్‌మానేరుకు భారీగా ఇన్‌ఫ్లో...


ప్రాజెక్ట్‌లోకి వస్తున్న నీరు

బోయినపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు ఎస్సారెస్పీ, మూలవాగు, మానేరు వాగు ద్వారా భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి సోమవారం సాయంత్రం వరకు 18,628 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రి పంప్‌హౌస్ నుంచి 9450 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 8వేలు క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 1178 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగు తున్నట్లు ప్రాజెక్ట్ డీఈ రాజు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.80ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 12.591 టీఎంసీల మేరకు చేరుకుంది.

ఉధృతంగా కూడవెళ్లి, పల్వంచ వాగులు

నిండు కుండలా ఎగువ మానేరు..


ఎగువ మానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

గంభీరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్మాల ఎగువ మానేరు జలాశయం నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెళ్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో నర్మాల ఎగువ మానేరు నిండుతోంది. మొత్తం మానేరు నీటి మట్టం 31 ఫీట్లు ఉండగా, సోమవారం రాత్రి వరకు 30 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకి పరవళ్లు తొక్కేందుకు కేవలం ఒకే ఫీటు నీళ్లు అవసరం ఉన్నాయి. సోమవారం రాత్రి లేక మంగళవారం ఉదయం మానేరు మత్తడి దూకే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తం అయ్యారు.

మానేరు పరివాహక ప్రాంతాలకు వెళ్లొద్దు..

నర్మాల ఎగువ మానేరు డ్యాంతో పాటు మానేరు వాగు సమీప ప్రదేశాలకు వెళ్లొద్దని తహసీల్దార్ మారుతిరెడ్డి సూచించారు. నర్మాల మానేరు ప్రాజెక్టును తహసీల్దార్ మారుతిరెడ్డి సోమవారం పరిశీలించారు. మానేరు జలాశయం నిండి మత్తడి దూకేందుకు సిద్ధంగా ఉన్నందున మానేరు డ్యాం, మానేరు వాగు పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, రైతు కూలీలు, మత్స్యకార్మికులు వెళ్లొద్దని తెలిపారు. పశువుల, గొర్లకాపరులు మేతకు తీసుకెళ్లద్దని సూచించారు. వాగు పక్కన పశువులను కట్టేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా పాత ఇళ్లలో ఉన్న వారు, ఫారెస్ట్ ప్రాంతాల సమీపాన నివాసం ఉండే వారు ఇతరత్రా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానేరు పరిసర ప్రాంతాల గ్రామాల్లో చాటింపు వేయడంతో పాటు 24గంటల పాటు అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించటానికి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

శంభో శంకరా..

● **లక్ష మంది వరకు రాజన్నను దర్శించుకున్న భక్తులు**


భక్తులతో కిక్కిరిసిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. సుమారు లక్ష మంది వరకు భక్తులు రాజన్న దర్శనానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులతో పట్టణ పురవీధులు, ఆలయ పరిసరాలు భక్తజన సంద్రంగా మారిపోయాయి. భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాలను సందర్శించిన భక్తులు మొక్కులు చెల్లించుకోగా, శివకల్యాణం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న ఆలయం ఎదుట రావిచెట్టు వద్ద దీపాలను వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయం ముందు భాగంలోని దారి పూర్తిగా భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఘనంగా మహాలింగార్చన..

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా రాజన్న ఆలయం ఉదయం 5.30 గంటలకు అర్చకులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో రాధాబాయి హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ విభాగాలను పరిశీలించిన ఈవో..

శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా రాజన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈవో రాధాబాయి పలు విభాగాల్లో ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. కోడెల క్యూ లైన్‌లు, బ్రేక్ దర్శనం, ధర్మగుండం, ఉచిత దర్శనం క్యూలైన్‌లతో పాటుగా ఓపెన్‌స్లాబ్ ప్రాంతాలను పరిశీలించారు. వెంట ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉన్నారు.


శివ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ధర్మపురిలో, కోటి లింగాలలో భక్తుల పూజలు

ధర్మపురి: శ్రావణ మాసం ఆఖరి సోమవారం శివ నామస్మరణలు చేసిన భక్తులతో క్షేత్రంలోని శివాలయాలు కిట కిటలాడాయి. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు శివుడికి జలాభిషేకం, బిల్వార్చన జరిపి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరునికి అన్నపూజ చేయించారు. నేరెళ్ల సాంబశివ, రాజారం, జైనా శివాలయాల్లో కూడ భక్తులు పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు- రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

వెల్గటూర్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని కోటి లింగాలకు భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్త లు గోదావరి ఒడ్డున గల గంగమ్మ తల్లికి పూజలు చేశారు. స్నాన ఘట్టాలపై ఉన్న శివ లింగాలకు భక్తితో మొక్కి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం శ్రీ పార్వతీ కోటీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వర్షాల కారణంగా గోదావరిలో నీటి మట్టం పెరగడంతో ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పోలీసు పహారా నిర్వహించారు. కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా పర్యవేక్షించారు.

ఎంఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 18:(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025న నిర్వహించిన ఎంఈడీ, ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంప్రదాయ దుస్తులు.. జీవన విధానం.. సాంస్కృతిక వేడుకలకు సంబంధించిన చిత్రాలు ప్రహరీ పై సజీవంగా దర్శనమిస్తున్నాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజన మహిళలు, గుడిసెలు, పాడి పశువులు, అమ్మవారికి తీసుకెళ్తున్న నైవేద్యం, డోలు వాయించడం, తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామ శివారులోని జగదాంబదేవీ ఆలయం ప్రహరీ గోడపై గిరిజన మహిళల వేడుక చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన కళాకారుడు చందుతో ఆకర్షణీయమైన చిత్రాలను వేయించారు. గిరిజన సంప్రదాయ పద్ధతులను ఈతరం వారికి వివరించేలా చిత్రాలు ఉన్నాయి.


తీజ్ వేడుకలకు సంబంధించిన చిత్రాలు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన జిల్లా యువ జన కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్ గౌడ్ నానమ్మ భూమవ్వ, మండల కేంద్రానికి చెందిన గుడిసె దేవవ్వ, మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన వరలక్ష్మీ ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను సోమవారం సాయంత్రం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, మాజీ సర్పంచులు స్వామిరెడ్డి, మహిపాల్, శంకర్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

పెగడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని నందగిరి తెనుగవాడ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అల్లారుముద్దుగా పాఠశాలకు రావడం జరిగింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చాట్ల వెంకటేశం, హెచ్.ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్ వాసికి అవార్డు

రాయికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కాయితి శంకర్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డును ఆదివారం మహారాష్ట్ర సోలాపూర్‌లో టొలాసా మెక్సికో అమెరికా యూనివర్సిటీ అధికారులు అందించారు. శంకర్‌ను వివిధ సంఘాల నాయకులు అభినందించారు.

ఆలయానికి మైక్ సెట్ బహూకరణ

రాయికల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలో కొలువుదీరిన కోరిన కోర్కెలు తీర్చే నక్కల గుట్ట నరసింహ స్వామి దేవాలయానికి పెంబట్ల గ్రామానికి చెందిన పోతు శంకర్-ఉమ దంపతులు రూ.20 వేల విలువ గల అహూజా కంపెనీ ఆంప్లిఫైర్, మైక్ సెట్‌ను సోమవారం బహూకరించారు. తాము కొంతకాలంగా దేవాలయానికి వస్తున్నామని, స్వయంభుగా వెలసిన లక్ష్మీ నృసింహ స్వామి తమకు కోరిన కోర్కెలు నెరవేరుస్తున్నాడని, అందుకే అభివృద్ధికి తమవంతుగా చిన్న బహుమతిని ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కాకుస్తం వెంకట కృష్ణ, వెంకటరమణ, ఆలయ చైర్మన్ మహేష్, జక్కుల చంద్రశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సోమవారం మండల కేంద్రానికి చెందిన బద్దం సత్యనారాయణరెడ్డి కవిత దంపతులు రూ.25వేల016 నగదును అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, ఆలయ పూజారి నాగరాజు రమేష్ తెలిపారు.

సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్- జిల్లావ్యాప్తంగా ఘనంగా సర్వాయి పాపన్న జయంతి





జగిత్యాలలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కోరుట్లలో నివాళి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కొనియాడారు. సోమవారం సర్వాయి పాపన్న జయంతిను పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. గౌడ కుల వృత్తి చేసుకునే వారి రక్షణకై కాటమయ్య కిట్లు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్ గౌడ్ మాజీ ఎంపిపి రమేష్, గుండా మధు, రఘువీర్ గౌడ్, ఆకుల రాజిరెడ్డి, అభి పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** యూసుఫ్‌నగర్ గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహానికి గౌడ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంగా గ్రామ మాజీ సర్పంచ్ తుక్కారాం గౌడ్, సంఘ నాయకులు సురేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, పృథ్వీ, వెల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని కోరుట్ల గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు పడాల నారాయణ గౌడ్ సంఘ సభ్యులు కొండ కిషన్ గౌడ్, సుదవేణి రవిగౌడ్, కుంట రాజగౌడ్, పడాల ప్రకాష్ గౌడ్, వల్లకొండ దనుంజయ్ గౌడ్, గోల్లపెల్లి నారాయణ గౌడ్, పంజాల వెంకట్ రాజం, కుంట తిరుమల గౌడ్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గౌడ సంఘం నాయకులు పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రామగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు చెట్ల చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాస్‌గౌడ్, సంకీర్త్‌గౌడ్, శ్రీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు అల్లకొండ ప్రతాప్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బాపు రాజేందర్‌గౌడ్, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, వేముగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**రాయికల్:** పట్టణంతో పాటు మండలంలోని ఇటిక్యాల, అల్లీపూర్, కొత్తపేట, మైతాపూర్ గ్రామాల్లో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమాల్లో రాయికల్ పట్టణ గౌడ సంఘం నాయకులు ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, పొన్నం శ్రీకాంత్, బండి ప్రవీణ్, వడ్లకొండ మహేష్, శ్రీను, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ ఆధ్వ ర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్ర మంలో దొప్పల జలంధర్, బొంగు నడ్పి సత్యనారాయణ, కల్లెడ శంకర్, వర్ధినేని నాగేశ్వర్‌రావు, సీతారామాంజ నేయులు, ఆకుల నర్సయ్య తదితరులు ఉన్నారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్‌తో పాటు వివిరావుపేట, ముత్యంపేట, సిర్పూర్ తదితర గ్రామాల్లో సోమవారం సర్వాయి పాపన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేశారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని అంగడి బజారులో, మండలంలోని పూడూర్ ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతిని గౌడ సంఘం నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

●**మల్యాల:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలను మల్యాల, కొండగట్టు, తాటిపెల్లి తదితర గ్రామాలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

●**ఎండపల్లి:** మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షులు తోడేటి రాజయ్య గౌడ్, బొంగాని సత్తయ్య గౌడ్ పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు మండలంలో గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాజశేఖర్ గౌడ్, రాములు గౌడ్, గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజేశం గౌడ్ పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రంతో పాటు డబ్బ తదితర గ్రామాలలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్,పుప్పాల నర్సయ్య, నేరెళ్ల సత్యంగౌడ్, రామ్‌గౌడ్, రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో నినాదాలు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

ధర్మపురి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో నీలారపు శ్రీనివాస్ అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి, అత్యవసరంగా మందులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి చుట్టు, పక్కన నీరు నిల్వకుండా చూడాలని తెలిపారు. ప్లాస్టిక్ కాంటెయినర్లు, టైర్లు, ఖాళీ సీసాలు, డ్రమ్ములు, సిమెంట్ కుండీలు రోళ్ళు, టైర్లు, పూల కుండీలు, కూలర్లు మొదలగు వాటిలో నీరు నిలవకుండా చూడాలని అన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమారి, సీహెచ్‌వో ఎల్లంకి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వెంకటేష్, సులోచన, ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ శోభన్‌బాబు, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

కోరుట్ల, ఆగస్టు 18 : వర్షానికి ఇల్లు, రేకులషెడ్ కూలిపోయిన నిర్వాసితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం పట్టణంలోని బెండపల్లి ప్రాంతానికి చెందిన అమీరోద్దిన్, లతీఫ్‌లను కలిసి జరిగిన నష్టం అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహాయం చేయాలని తహసీల్దార్ కృష్ణ చైతన్యను కోరారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. తీవ్ర వర్షాలు ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీందర్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, మాజీ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం నాయకులు అన్నం అనిల్ కుమార్, తిరుమల గంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛతపై నజర్

(ఐదో పేజీ తరువాయి)

పొందినట్లుగా ప్రకటిస్తారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం స్కోరు ఆధారంగా రేటింగ్ నిర్ధారించి మెరిట్ సర్టిఫికెట్ ఇస్తారు. పాఠశాలలు ఎస్‌హెచ్‌వీఆర్, ఎడ్యుకేషన్, జీటీటీ.ఇన్, ప్రత్యేక పోర్టల్ లేదా ఎస్‌హెచ్‌వీఆర్ మొబైల్ యాప్‌లో సమాచారాన్ని నింపి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు.

ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

-రాము, జిల్లా విద్యాశాఖ అధికారి



గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌ను సవరించి ఎస్‌హెచ్‌వీఆర్ 2025-26ను ప్రవేశ పెట్టారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత చొరవతో పాఠశాలలు విద్య, మౌలిక వసతుల పరంగా ఉన్నత స్థాయిలో నిలుస్తున్నాయి. ప్రధానోపాధ్యాయులు ఎస్‌హెచ్‌వీఆర్ యాప్ ద్వారా ఇందులో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి



ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం గోదావరి నదిలోకి ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నీరు విడుదల చేయడం వల్ల ప్రవాహం వేగంగా మారింది. దీంతో గోదావరి నది నిండు కుండలా మారింది. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ధర్మపురి వద్ద సంతోషీమాత, మంగళిగడ్డ, సోమవిహార్, మహాలక్ష్మి, రాయపట్నం వద్ద స్నానఘట్టాలు పైనుంచి నీటి ప్రవాహం కొనసాగుతుంది. భక్తులు లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయరాదని ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు వరద పరిస్థితిని సమీక్షించారు.

● **కోటిలింగాల వద్ద..**

వెల్గటూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో వెల్గటూర్ మండలం లోని కోటిలింగాల వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. వర్షానికి గోదావరి పరీవాహక ప్రాంతం లోని వాగులు, వంకలు పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తి 34,193 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నీటి మట్టం పెరుగుతోంది. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి గోదావరిలో వరద ఉధృతిని పరిశీలించారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపరులను పశువులను లోతట్టు ప్రాంతాలకు తోలవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమాసాగర్, ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్, డైరెక్టర్ గుమ్ముల వెంకటేష్, రాజయ్య, కానిస్టేబుల్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్యాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటలో నాలుగు రోజుల క్రితం సంత లక్ష్మి అనే మహిళా రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందగా సోమవారం మృతురాలి కుటుంబసభ్యులను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ వేర్వేరుగా పరామర్శించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒకరికొకరు ఎదురుపడడంతో కొద్దిసేపు మాట్లాడుకున్నారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆసక్తిగా గమనించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి, ఆనందరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాశ్ బీఆర్ఎస్ నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, సామల దేవరాజం, గుర్రం మల్లేశంగౌడ్, చిన్నస్వామిరెడ్డి, పంజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సోమవారం ప్రజావాణిలో 25 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పాస్ బుక్కు ఇప్పించాలి

-సిరిపురం అంజయ్య, ముత్యంపేట గ్రామస్థుడు

మల్యాల మండలం ముత్యంపేట శివారులో నేను 13 గుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేశా. అపుడు పాస్‌బుక్ ఇచ్చారు. 2018 ధరణి పోర్టల్ వచ్చినపుడు నాభార్య పేరుపై పాస్‌బుక్ జారీ చేయలేదు. అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వో తిరుపతిలు నాపై కక్ష కట్టి నా భూమిని మిగులు భూమిగా రెవెన్యూ రికార్డులలో నమోదు చేశారు.

'భూమి పట్టాలు పంపిణీ చేయాలి'

వెల్గటూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాము సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిని తమ పేరు మీద పట్టాలు పంపిణీ చేయాలని సోమవారం జగిత్యాలలో జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతకు చెగ్యాం గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోగా కొన్ని సంవత్సరాలుగా గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమిని 175 మంది సాగు చేసుకుంటున్నామని, వాటికి పట్టాలు పంపిణీ చేయాలని గ్రామస్థులుకోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

ఎండపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజారాంపల్లి వద్ద పాతగూడూర్ రోడ్డు మార్గంలో రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు రక్షణ చర్యలు పాటించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యధికంగా ధర్మపురి మండలం నేరేళ్లలో 28.5 మిల్లీ మీటర్లు, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 26.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బీమారం మండలం మన్నెగూడెంలో 0.8 మిల్లీ మీటర్లు, మల్లాపూర్ మండలం రాఘవపేటలో 1.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కాగా ఎండపల్లి మండలం గుల్లకోటలో 23.0 ఎంఎం, మేడిపల్లిలో 19.8 ఎంఎం, వెల్గటూరు 18.5 ఎంఎం, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 17.5 ఎంఎం, గొల్లపల్లిలో 15.0 ఎంఎం, జగిత్యాలలో 14.8 ఎంఎం, కోరుట్లలో 14.3 ఎంఎం, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 13.5 ఎంఎం, మెట్‌పల్లిలో 13.0 ఎంఎం, మల్లాపూర్‌లో 12.0 ఎంఎం, రాయికల్‌లో 11.0, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 10.3 ఎంఎం, మల్యాల మండలం మద్దుట్లలో 7.3 ఎంఎం, కథలాపూర్‌లో 6.3 ఎంఎం, కొడిమ్యాల మండలం పూడూరులో 2.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కాగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం వల్ల జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో రహదారులు, మురికి కాలువలు జలమయమయ్యాయి. వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జిల్లాలోని ధర్మపురి, వెల్గటూరు మండలం కోటిలింగాల వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది.





వెల్గటూర్‌లో సీసీ రోడ్డు పైనుంచి పారుతున్న నీరు, కోరుట్లలో కూలిన ఇల్లు

●**లోతట్టు ప్రాంతాలు జలమయం**

వెల్గటూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. వెల్గటూర్ మార్కండేయ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో మురుగు నీటి కాలువలు పోటెత్తి సీసీ రోడ్డు పైనుండి నీరు ప్రవహించడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. వెంకటాపూర్‌లో మేకల భాగ్యమ్మ, కప్పారావుపేటలో కొలకాని బాపన్నలకు చెందిన రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రాంరెడ్డి, రాజేశ్వరిలు కూలిన ఇళ్లను పరిశీలించి నష్టం విలువ అంచనా వేశారు.లోతట్టు ప్రాంతాల వారు అప్ర మత్తంగా ఉండాలని తహశీల్దార్ శేఖర్ సూచించారు.

●**కూలిన ఇల్లు**

కోరుట్ల: పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బెండపల్లి ప్రాంతంలో ఒక రేకుల షెడ్‌తో పాటు పురాతన ఇల్లు గోడ కూలిపోంది. సోమవారం ఉదయం కురిసిన వర్షంతో కాలనీకి చెందిన అమీరోద్దిన్‌కు చెందిన రేకుల షేడ్ దానికి ఆనుకోని ఉన్న లతీఫ్ గూన ఇల్లు గోడ కూలింది.

బీలాలుపుర ప్రాంతంలోని కొన్ని ఇండ్ల సమీపంలోని ఖాళీ స్థలంలో వర్షం నీరు నిండగా మున్సిపల్ అధికారులు తాత్కాలిక కాల్వలను ఏర్పాటు చేసి నీటిని తరలించారు. రేకుల షేడ్, కూలిన ఇంట్టి స్థలంను కోరుట్ల తహసిల్దార్ కృష్ణ చైతన్య, కమీషనర్ రవీందర్‌లు పరిశీలించారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లొద్దు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం తహసిల్దార్ వరప్రసాద్ పేర్కొన్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి క్రస్ట్ గేట్ల ద్వారా గోదావరి నదిలోకి నీటిని విడుదల చేసిన దృష్ట్యా సోమవారం మండలంలోని ఎర్దండి, కోమటి కొండాపూర్ గ్రామాలలో గల గోదావరి నది పరివాహ ప్రాంతాన్ని ఎస్సై అనిల్, ఎంపీడీవో సలీం లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నదిలోకి చేపల వేటకు ఎవరు వెళ్లవద్దని, గొర్రెల కాపరులు నదీ పరివాహ ప్రాంతాల్లో తిరగబద్దని, పశువులను నదిలోకి తోలుకపోవద్దని సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే నదీ ప్రవాహం పెరిగి గ్రామాల్లోకి వరద చేరితే అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులకు పునరావాసం కొరకు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని గదులను మౌలిక వసతుల కోసం పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు మనోజ్, సరిత, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రైతుల కష్టాలు తీర్చాలి

సారంగాపూర్, ఆగస్టు, 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల కష్టాలు తీర్చాలని మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత డిమాండ్ చేశారు. మండలంలోని బట్టపెల్లి గ్రామంలో గల చింతలపలి బతుకమ్మ ఒర్రెకు గత ప్రభుత్వంలో కల్వర్టు నిర్మాణం కోసం రూ.45 లక్షలు మంజూరు అయ్యాయి. కానీ ఇప్పటి వరకు గుత్తేదారు పనులను ప్రారంభించకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత సురేష్ సోమవారం స్థానిక రైతులు, నాయకులతో కలిసి బతుకమ్మ ఒర్రెను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులు పడుతున్న విషయాన్ని వివరించారు. సారంగాపూర్ నుండి బట్టపెల్లి వెళ్ళే రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉందని వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ సహకార సంఘం అధ్యక్షులు సాగి సత్యంరావు, బీర్పూర్ మండల అధ్యక్షులు నేరెళ్ల సుమన్, మాజీ సర్పంచ్ బైరి మల్లేష్, నాయకులు, దేశరాజులు నందయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

కోరుట్ల రూరల్, ఆగస్టు 18 : విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ఎంపీడీఓ రామ కృష్ణ ఉపాధ్యాయులకు సూచిం చారు. సోమవారం పట్టణంలోని గడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు బోధనాభ్యసన స్థాయి మేళా కార్యక్రమాన్ని మండల విద్యాధికారి నరేశంతో కలిసి ఎంపీడీఓ రామకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలన్నారు.

●**రాయికల్:** ఉపాధ్యాయులు సమాజ మార్గ దర్శకులని రాయికల్ తహసీల్దార్ ఉదయ్ కుమార్ అన్నారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి బోధనోపకరణాల మేళా నిర్వహించారు. జిల్లా స్థాయికి ఎంపికైన 10 ఉత్తమ బోధనోకరణాలను రూపొందించిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, ఎంఈవో శ్రీపతి రాఘవులు, ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కడకుంట్ల అభయ్ రాజ్, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు రాజేందర్, మహేష్, ఉషకోల రాము, సీఆర్‌పీలు రవీందర్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బోధనోపకరణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

●**సారంగాపూర్:** టీఎల్ఎం కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెరుగుతాయని, విద్య మరింత ఆసక్తి కరంగా మారుతుందని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం టీఎల్ఎం మేళాను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బి.కిషోర్, ప్రధానోపాధ్యాయులు తొగిటి సత్యనారాయణ మూర్తి, అచ్యుతరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి బోధనోపకరణాల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను జిల్లా స్థాయి ప్రదర్శనలకు ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి జయసింహారావు తెలిపారు. పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనుపమ, రాజ గోవిందరెడ్డి, కరీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.